క్లుప్తంగా

2న డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి

వేమూరు: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సెప్టెంబర్ 2వ తేదీన నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్ బాబు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు అన్ని గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. నియోజక వర్గం ప్రధాన కేంద్రంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

ధర్మ పరిరక్షణ ఎంతో ముఖ్యం



భట్టిప్రోలు: మానవుడు ధర్మాన్ని మరచిపోకూడదని, తన స్వార్థం కోసం పది మందికి ఇబ్బంది కలిగించడం ధర్మం కాదని శుక్రవారోత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి బూర్లె అరుణ కుమారి పేర్కొన్నారు. శ్రావణమాసాన్ని పురస్కరించుకుని ఏర్పాటైన పారాయణ కార్యక్రమం శనివారం భట్టిప్రోలుకు చెందిన బి. విజయ్‌కుమార్-రోజారాణి స్వగృహంలో నిర్వహించారు. కార్యక్రమంలో సుగుణవతి, కన్యక, స్వరూపరాణి, గృహలక్ష్మి, హేమలత, ధనలక్ష్మి, సునీత, నళిని, శ్రీ వాణి, సూర్యప్రభ, శశికళ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కొల్లూరులో 91 శాతం పింఛన్ల పంపిణీ

కొల్లూరు : మండలంలో 91.08 శాతం సామాజిక పింఛన్ల పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపీడీఓ ఐ. సత్యనారాయణరావు తెలిపారు. శనివారం ఉదయం నుంచి ప్రారంభించిన పంపిణీ ప్రక్రియకు వర్షం ఆటంకంగా మారిందన్నారు. అయినప్పటికీ సచివాలయ సిబ్బంది ఇంటింటికీ తిరిగి అందించారని తెలిపారు.

ప్రజలందరూ కలిసి మెలిసి జీవించాలి



కర్లపాలెం: గ్రామస్తులందరూ వివాదాలకు పోకుండా కలిసి మెలిసి జీవించాలని కర్లపాలెం ఎస్ఐ ఎస్. రవీంద్ర చెప్పారు. మండల పరిధిలోని ఏట్రవారిపాలెంలో ఆయన తన సిబ్బందితో శుక్రవారం రాత్రి పల్లెనిద్ర చేశారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ.. అందరూ సోదర భావంతో మెలగాలన్నారు. ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

ఎండీయూ వ్యవస్థను కొనసాగించాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమైఖ్య ఎండీయూ ఆపరేటర్ల యూనియన్ వినతి



తెనాలి: రాష్ట్రవ్యాప్తంగా రేషను బియ్యం పంపిణీ వ్యవస్థలో పనిచేస్తున్న ఎండీయూ ఆపరేటర్లను కొనసాగించాలనీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమైఖ్య ఎండీయూ ఆపరేటర్లయూనియన్ నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. ఆ ప్రకారం రాష్ట్ర ఆహార, పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను శనివారం తెనాలిలో కలిసి వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వం 9,260 మందిని ఎండీయూ ఆపరేటర్లుగా, 9,260 మంది హెల్పర్లను నియమించి గత మూడేళ్ల అయిదు నెలలుగా రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటికీ రేషను పంపిణీ చేయిస్తున్నట్టు తెలిపారు. డిగ్రీ, పీజీ, బీటెక్ చదివిన నిరుద్యోగులు ఎందరో ఈ వ్యవస్థలో ఉపాధి పొందుతున్నారని తెలిపారు. ప్రస్తుతం నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ఎండీయూ వ్యవస్థను రద్దుచేస్తే, 9,260 ఎండీయూ ఆపరేటర్లు, మరో 9,260 మంది హెల్పర్ల కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. తమకు పార్టీ ముద్ర వేయటం సమంజసం కాదనీ, వ్యవస్థలో లోపాలుంటే వాటిని సరిదిద్ది, తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కూటమి ప్రభుత్వం నిరుద్యోగులు, పేదల పక్షాన నిలబడి న్యాయం చేయాలని కోరారు.

ఉధ్ధృతంగా ప్రవహిస్తున్న కృష్ణమ్మ

- ఓలేరు పల్లెపాలెం, పెదలంక కాకుల డొంక వద్ద వరద
- ప్రభావిత గ్రామాల్లో అధికారుల ముందస్తు చర్యలు
- నీట మునిగిన పంట పొలాలు
- విద్యుత్ తీగలపై కూలిన చెట్లు భట్టిప్రోలులో కుండపోత



భట్టిప్రోలు మండలం ఓలేరు పల్లెపాలెం వద్ద వరద ఉధ్ధృతి

భట్టిప్రోలు: ప్రకాశం బ్యారేజీ వద్ద దిగువకు శనివారం భారీగా నీటిని విడుదల చేయడంతో భట్టిప్రోలు మండలంలోని ఓలేరు పల్లెపాలెం, పెదలంక కాకుల డొంక వద్ద కృష్ణమ్మ ఉధ్ధృతంగా ప్రవహిస్తోంది. పల్లెపాలెం రేవులో వరద నీరు అధికంగా పారడంతో స్థానికులు రేవులోకి వెళ్లవద్దని తహసీల్దార్ మేకా శ్రీనివాసరావు ఆదేశించారు. పల్లెపాలెం రేవు వద్ద వరద నీరు 13 అడుగులు మేర ప్రవహిస్తోంది. ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా గజ ఈతగాళ్లను, నాటు పడవలను అధికారులు సిద్ధం చేశారు. వీఆర్వోలు మండ్రు జక్రయ్య, రాంబాబులు ఎప్పటికప్పుడు పరిస్థితిని తెలుసుకుంటున్నారు. పెదలంక సమీపంలోని కాకుల డొంక వద్ద కృష్ణమ్మ ఉగ్రరూపం అలాగే ఉంది. శుక్రవారం మధ్యాహ్నం నుంచి భట్టిప్రోలు మండలంలోని లంక గ్రామాల్లోని పెదపులివర్రు- పెసర్లంక, ఓలేరు- పెసర్లంక, కోళ్లపాలెం- పెసర్లంక చప్టాల వద్ద నీరు చేరింది. దీంతో ఆయా మార్గాల్లో తాత్కాలికంగా



అమర్తలూరు మండలంలో నీటి మునిగిన పంట పొలాలు

రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అదేవిధంగా కరకట్టలు బలహీనంగా ఉన్న ప్రాంతాలలో రివర్ కన్జర్వేషన్ ఏఈలు నాగేశ్వర్ నాయక్, సురేష్‌లు మరమ్మతులు చేయించారు. ఇసుక బస్తాలను సిద్ధంగా ఉంచారు. కరకట్ట దిగువున ఉన్న లోతట్టు ప్రాంతాలోని వాణిజ్య పంటలలో వరద నీరు చేరింది. వివిధ శాఖల అధికారులు వరద ప్రభావిత గ్రామాలలో సేవలు అందిస్తున్నారు. గత నాలుగేళ్లుగా కృష్ణానదికి వస్తున్న వరదలు రైతులకు తీరని వ్యథ మిగులుస్తున్నాయి. దీంతో పంట నీట మునిగిపోవడంతో రైతులు తీవ్రంగా నష్ట పోవాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ఈ ప్రాంతంలోని పంటలు వరద నీటిలో చిక్కుకున్నాయి. మండలంలోని కృష్ణానది పరివాహక లంక గ్రామాల్లో వాణిజ్య పంటలైన అరటి, పసుపు, కంద, కూరగాయలు, తమలపాకు పంటలు, జామ, బొప్పాయి పండ్ల తోటలకు కొన్నిచోట్ల నష్టం వాటిల్లింది.

- **వేమూరు(అమర్తలూరు):** అమర్తలూరు మండలంలోని 25 వేల ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. మురుగు నీరు పారుదల సక్రమంగా లేక పోవడంతో సుమారు 2 వేల ఎకరాలు నీట మునిగాయి.

ఎడతెరిపి లేకుండా కుండపోత

భట్టిప్రోలులో శుక్రవారం మధ్యాహ్నం నుంచి శనివారం వరకు ఎడతెరిపి లేకుండా కుండపోత వర్షం కురిసింది. రహదారులు జలమయం అయ్యాయి. ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలకు ఈ వర్షాలు ఊరటనిచ్చాయి. భట్టిప్రోలులో 72.2, కొల్లూరులో 103.2, వేమూరులో 85.4, అమృతలూరులో 87.2, చుండూరులో 89.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. సాగు నీటి కాల్వలలో వరద ప్రవహిస్తోంది. చెరువులు నిండుకుండలను తలపిస్తున్నాయి. పలు పల్లపు ప్రాంతాలు నీట మునిగాయి. చాకలి చెరువు, పెద చెరువులలోని నీరు ఎగదన్నడంతో భట్టిప్రోలులోని కొత్త విఠలేశ్వరనగర్ కాలనీ, దేవాలయం వద్ద వర్షపు నీరు చేరింది. ఐలవరంలో కూడా రాకపోకలకు ఇబ్బందిగా ఉంది.

- **పిట్టలవానిపాలెం:** రోజంతా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో పిట్టలవానిపాలెం మండలం తడిసి ముద్దయింది. కాలు బయట పెట్టే వీలు లేకుండా పోయింది. శుక్రవారం ఉదయం నుంచి కురుస్తున్న వర్షం శనివారం సైతం పిట్టలవానిపాలెంలో కొనసాగింది. పిట్టలవానిపాలెం, మంతెనవారి పాలెం, కొత్తపాలెం, గొడపాలెం, గోకరాజు నల్లిబోయినవారి పాలెం, ఖాజీపాలెం



పిట్టలవానిపాలెంలో నీట మునిగిన వరి పైరు

తదితర గ్రామాలలోని వరి పొలాలు పూర్తిగా నీటమునిగాయి. అన్నదాతలు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. పిట్టలవానిపాలెం మండలంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఎస్టీ కాలనీ, ప్రధాన రహదారులు, గోకరాజు నల్లిబోయినవారి పాలెం గ్రామంలోని ప్రధాన రహదారులు, ఖాజీపాలెం శివారు కప్పలవారిపాలెంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ముందు వర్షపు నీరు నిలిచింది. వాహనచోదకులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు.

- **వేమూరు:** మండలంలో శుక్రవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షం వల్ల పంట పొలాలు మునిగిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. 17 గ్రామాల్లో పొలాలు మునిగినట్లు బాధితులు తెలిపారు. భారీ వర్షాలకు మండలంలోని గ్రామాలన్ని జలమయం అయ్యాయి. వేమూరు, కొల్లూరు, భట్టిప్రోలు, అమర్తలూరు మండలాల రహదారులు నీట మునిగాయి. దీంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సైడ్ డ్రెయిన్లు మరమ్మతులు పనులు చేయక పోవడంతో నీరు రోడ్లుపై నిలిచిపోయింది.
- **నగరం:** మండలంలోని నగరం, శిరిపూడి, పెదపల్లి, ఈదుపల్లి, దాసరిపాలెం తదితర గ్రామాలలో వేల ఎకరాలలో వరి పంట వర్షార్పణమైంది. సుమారు 2 వేల ఎకరాలకుపైగా నీటి మునిగినట్లు రైతులు చెబుతున్నారు.
- **వేమూరు(చుండూరు):** చుండూరు మండలంలోని చినపరిమి గ్రామంలో చెట్టు విరిగి కరెంట్ తీగపై పడింది. విద్యుత్ సిబ్బంది వెంటనే మరమ్మతులు చేపట్టారు. చినపరిమి గ్రామంలో పొలాల్లో కరెంట్ తీగలపై తాటి చెట్టు పడింది. అక్కడా మరమ్మతులు చేసినట్లు విద్యుత్ ఎస్ఈ ఎం.అర్జునరావు తెలిపారు.
- **కరెంట్ తీగలపై పడిన చెట్టు**

వేమూరు(అమర్తలూరు): అమర్తలూరు మండల కేంద్రంలోని చెట్టు కరెంట్ తీగలపై పడటంతో విద్యుత్ సరఫరాకు 5 గంటలు అంతరాయం కలిగింది. సిబ్బంది చెట్టును తొలగించి సరఫరాను పునరుద్ధరించారు.

- **నీట మునిగిన వరి పొలాలు**

చెరుకుపల్లి: వాయుగుండం ప్రభావంతో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి నాట్లు వేసిన వరి పొలాలు వర్షపు నీటితో పూర్తిగా మునిగిపోయి నదులను తలపిస్తున్నాయి. కాలువలు పూర్తిగా పూడిపోవటంతో నీరు దిగువకు వెళ్లడం లేదు.

- **రేపల్లె నియోజకవర్గంలో..**

రేపల్లె రూరల్: అల్పపీడన ప్రభావంతో నియోజకవర్గంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. పట్టణంలోని నిజాంపట్నం రోడ్డు, బస్టాండ్ సెంటర్, బసవేశ్వర థియేటర్ రోడ్డు, మున్సిపల్ ఆఫీస్ రోడ్డు, ప్రకాశం రోడ్డుతో పాటు నేతాజీ నగర్, 22 23వ వార్డులలో పలు రహదారులు జలమయం అయ్యాయి. రేపల్లె పట్టణంలోని ఇండియన్ బ్యాంకు రోడ్డు, రెవిన్యూ డివిజనల్ కార్యాలయం రహదారిలో చెట్లు కూలాయి.



రేపల్లెలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలోకి చేరిన వర్షపు నీరు

మండలంలోని చాటగడ్డలో రెండు విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. చెట్లను, స్తంభాలను విద్యుత్ శాఖ అధికారులు వెంటనే తొలగించారు. నిజాంపట్నం, చెరుకుపల్లి, నగరం, రేపల్లె మండలంలో సుమారు ఎనిమిది వేల ఎకరాలకుపైగా వరి నారు నీట మునిగినట్లు సమాచారం. శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం ఉదయం వరకు రేపల్లెలో 72.2, చెరుకుపల్లిలో 80.2, నగరంలో 71.4, నిజాంపట్నంలో 43.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు రేపల్లెలో 68.6, నగరంలో 101.6, చెరుకుపల్లిలో 79.8 , నిజాంపట్నంలో 66.6 మిల్లీమీటర్ల వంతున వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.



రేపల్లె పట్టణం బసవేశ్వర థియేటర్ వెనుకబజారులో జలమయమైన రహదారి

తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



పెనుమూడి వద్ద కృష్ణానది తీరాన్ని పరిశీలించిన అధికారులు

రేపల్లె రూరల్: కృష్ణానది వరద ఉధ్ధృతి నేపథ్యంలో నదీ పరీవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని దేవదాయ, , ధర్మదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్, మండల స్పెషల్ ఆఫీసర్ పానకాలరావు సూచించారు. ప్రకాశం బ్యారెజ్ వద్ద వరద నీరు విడుదల చేయడంతో శనివారం ఆయన మండలలలోని పెనుమూడి వద్ద కృష్ణానది, పరిసర గ్రామాలను సందర్శించి, ప్రజలతో మాట్లాడారు. ప్రస్తుతం బ్యారెజ్ దిగువకు 3.60 లక్షల క్యూసెక్కుల నీరు విడుదల చేశారని చెప్పారు. వరద ఉధ్ధృతి మరింత పెరిగే అవకాశం ఉన్నందున నదిలోకి వేటకు వెళ్లరాదని మత్స్యకారులకు సూచించారు. పశువులను మేపుకునేందుకు నదిలోని లంక భూముల్లోకి వెళ్లొద్దని పశుకాపరులను హెచ్చరించారు. ఆయన వెంట తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, ఎంపీడీవో శివపార్వతి, ఈవోపీఆర్డీ మల్లికార్జునరావు, మత్స్య, పశుశాఖల అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బడుల్లోకి చేరిన వర్షపు నీరు



కొల్లూరు ఎస్సీ కాలనీలోని బీఎస్ఎఫ్ పాఠశాలలోకి చేరిన వర్షపు నీరు



కొల్లూరు మండలం తోకలవారిపాలెంలో పంచాయతీ కార్యాలయంలో వర్షపు నీరు

కొల్లూరు : మండలంలోని మాగాణి ప్రాంతంలో సుమారు 11 వేల ఎకరాల వరి పొలాలను వర్షపు నీరు ముంచెత్తింది. దోనేపూడి, కొల్లూరు, చినపులివర్రు, తాడిగిరిపాడు, రావికంపాడు, క్రాప, అనంతవరం ప్రాంతాలలో పొలాలు ముంపుకు గురయ్యాయి. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు 103.20, శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు 95.40, వెరసి 198.60 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. కొల్లూరు ఎస్సీ ప్రాంతం, దోనేపూడి శివారు మగ్గాలపాలెం , కోటిపల్లి, ఆలపాటినగరం తదితర లోతట్టు ప్రాంతాలలోని గృహాలలోకి వర్షపు నీరు చేరింది. కొల్లూరు గొడపాలెం ప్రాంతంలో తెనాలి – రేపల్లె ప్రధాన రహదారితోపాటు అంతర్గత రోడ్లు జలమయం అయ్యాయి. తోకలవానిపాలెం పంచాయతీ కార్యాలయం వర్షపు నీటి ముంపుకు గురవ్వగా, కొల్లూరు ఎస్సీ ఏరియాలోని బీఎస్ఎఫ్ ప్రాథమికోన్నత పాఠశాల, బీఆర్‌కే శాస్త్రీ ఐటీఐ కళాశాల ప్రాంగణాలు వర్షపు నీటితో నిండాయి.



భట్టిప్రోలు మండలం పెదపులివర్రు సమీపంలో అరటి తోటను చుట్టుముట్టిన వరద నీరు



జంపని వద్ద నీటమునిగిన పంటపొలాలు



రేపల్లె పట్టణం రైల్వేస్టేషన్ రోడ్డులో నిలిచిన వర్షపు నీరు



కొల్లూరు మండలం పెసర్లంక వద్ద దొండ పంటలో నిలిచిన వర్షపు నీరు



భట్టిప్రోలు కొత్త విఠలేశ్వర నగర్‌లో వర్షపు నీరు

పోషకాల పుట్ట గొడుగులు!

ప్రధాన కూడలి ప్రాంతాల్లో విక్రయిస్తున్న గిరిజనులు



పుట్టగొడుగులు విక్రయిస్తున్న మహిళలు

బాపట్ల టౌన్: పుట్టగొడుగులు... ఈ సీజన్‌లో మాత్రమే దొరికే అరుదైన ఆహార పదార్థం. సహజ సిద్ధంగా అడవుల్లోని పుట్టల్లో మాత్రమే లభించే వీటిని నాటు పుట్టగొడుగులుగా పిలుస్తారు. వీటిని రుచికరంగా వండుకుని భుజించేందుకు ప్రజలు ఆసక్తి చూపుతారు. ప్రతి ఏడాది ఆగష్టు, సెప్టెంబర్ మాసాల్లో వరి నాట్లు మొదలయ్యే సమయంలో కురిసే భారీ వర్షాలకు పుట్ట గొడుగులు మొలకెత్తడం ప్రారంభమవుతాయి. తీరప్రాంతాల్లోని అడవుల్లో, గ్రామీణ ప్రాంతాల్లోని పంటపొలాల కాలువ గట్లు, డ్రెయిన్ కట్టలపై ఉన్న పుట్టలు వీటికి ఉత్పత్తి కేంద్రాలుగా ఉంటాయి. ముఖ్యంగా జిల్లాలోని బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం, రేపల్లె, నిజాంపట్నం, నగరం, చెరుకుపల్లి, చీరాల, వేటపాలెం, చిన్నగంజాం మండలాల పరిధిలో లభ్యమవుతాయి. నిత్యం అడవుల్లో తిరిగే గిరిజనులకు వాటని తీసుకువచ్చి పట్టణంలో విక్రయిస్తున్నారు. ఇసుక నేలల్లోని పుట్టగొడుగులకు మంచి డిమాండ్ ఉంటుంది. వీటిల్లో పోషకాల వల్ల ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయని వైద్యాధికారులు చెబుతున్నారు.

ఇవీ ప్రయోజనాలు

- పుట్టగొడుగుల్లో ఇర్గోథియోనైన్, సెలీనియం అనే రెండు యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి శరీరంలో డీఎన్ఏను దెబ్బతీస్తూ, గుండె జబ్బులకు, క్యాన్సర్‌కు కారణమయ్యే ఫ్రీరాడికల్స్‌ను ఎదుర్కొంటాయి.
- పుట్టగొడుగుల్లో 90 శాతం నీరే ఉంటుంది. పోటాషియం లభిస్తుంది. కొవ్వు పదార్థాలు తక్కువ. బరువు పెరుగుతామనే భయం ఉండదు. రక్త పోటును అదుపులో ఉంచుతుంది.

ఆర్థిక సాయం అందించాలి: జోగి రాజా



బాపట్ల: బాపట్ల పట్టణంలోని జలమయమైన లోతట్టు ప్రాంత ప్రజలకు ఒక్కొక్కరికి రూ.10 వేలు ఆర్థిక సాయం అందించాలని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షులు జోగి రాజా కోరారు. రెండు రోజులుగా వర్షపు నీటిలోనే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రాజా పేర్కొన్నారు. పేదలను ఆదుకునేందుకు ప్రభుత్వం తక్షణ సాయం అందించాలన్నారు.

తెగిన నిడమర్రు చెరువు

మంగళగిరి: నగర పరిధిలోని నిడమర్రు చెరువు తెగడం స్థానికులను ఆందోళనకు గురిచేసింది. శనివారం కురిసిన భారీ వర్షానికి చెరువు తెగడంతో వర్షపు నీరు టిడ్కో నివాసాలతో పాటు ఎస్సీ కాలనీలోని ఇళ్లల్లోకి భారీగా చేరడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇళ్లల్లోని నీటిని బయటకు పంపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా చెరువు తెగి ఇళ్లల్లోకి నీరు చేరిందని స్థానికులు తెలిపారు.

పట్టణాభివృద్ధికి అందరూ సహకరించాలి

మున్సిపల్ ఛైర్‌పర్సన్ కట్టా మంగ

రేపల్లె రూరల్: పట్టణాభివృద్ధిలో అధికారులు, ప్రజాప్రతినిధులతోపాటు ప్రజలు కూడా భాగస్వాములు కావాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ కట్టా మంగ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన కౌన్సిల్ సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. అంతరాయం లేకుండా సరఫరా చేస్తున్నామని చెప్పారు. పట్టణంలో పారిశుద్ధ్యం నిర్వహణ మెరుగుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. కాలువల్లో నిరంతరం పూడికలు తీయించటం, అవసరమైన ప్రదేశాలలో బ్లీచింగ్ చల్లడం కొనసాగిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఎజెండాలోని 16 అంశాలను సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. వైస్ ఛైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, తూనుగుంట్ల కాశీ విశ్వనాథ గుప్తా, కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

చెరుకుపల్లి: చెరుకుపల్లి పోలీసులు పేకాట స్థావరంపై మెరుపు దాడి చేశారు. 25 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటన శనివారం రాత్రి జరిగింది. స్థానిక ఎస్సై అనిల్‌కుమార్ అందించిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని గుళ్ళపల్లి బూర్లమ్మ డొంకలోని ఓ ఇంటిలో పేకాట ఆడుతున్నట్టు వచ్చిన సమాచారం మేరకు ఐదు రోజులు రెక్కీ నిర్వహించారు. శనివారం రాత్రి ఆ ఇంటిపై దాడి చేసి 25 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి సుమారు రూ. లక్ష నగదు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పోలీస్ సిబ్బంది సేవలు హర్షణీయం

ఉద్యోగ విరమణ చేసిన సిబ్బందిని సన్మానించిన ఎస్పీ తుషార్‌డూడీ

బాపట్లటౌన్: పోలీస్‌శాఖలో నాలుగు దశాబ్దాలకు పైగా సుదీర్ఘసేవలు అందించడం హర్షణీయమని జిల్లా ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. జిల్లా పోలీస్ విభాగంలో పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన ఇద్దరు సిబ్బందిని శనివారం ఎస్పీ సన్మానించారు. ఎస్పీ తుషార్‌డూడీ మాట్లాడుతూ పోలీసు ఉద్యోగం చాలా ఒత్తిడితో కూడుకున్నదన్నారు. ప్రజలకు నేరుగా సేవలు అందించడం పోలీసు ఉద్యోగంలోనే జరుగుతుందన్నారు. అలాంటి ఉద్యోగంలో చేరడం చాలా గొప్ప అదృష్టంగా భావించాలన్నారు. పోలీస్ శాఖకు సుదీర్ఘ కాలం పాటు విశేషసేవలు అందించడం ఎంతో గొప్ప విషయమన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆహ్లాదకరంగా గడపాలని, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సుదీర్ఘ కాలం క్రమశిక్షణతో, బాధ్యతయుతంగా విధులు నిర్వహించి, ఉద్యోగ విరమణ పొందడం అభినందనీయమన్నారు. ఎటువంటి సమస్యలు వచ్చినా నేరుగా తనను కలవవచ్చనని, సహాయం చేసేందుకు సిద్ధంగా ఉంటామన్నారు. ఉద్యోగ విరమణ చేసిన వారిలో ఏఎస్ఐ ఆనంద్‌బాబు, సీనియర్ అసిస్టెంట్ ఈవీఎస్ఎన్ కిషోర్‌లు ఉన్నారు. అనంతరం ఇరువురిని పూలమాలలు, దుశ్శాలువాలతో ఎస్పీ ఘనంగా సత్కరించారు. వెల్ఫేర్ ఆర్ఐ డి.శ్రీనివాసరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



ఉద్యోగ విరమణ చేసిన సిబ్బందిని సన్మానిస్తున్న ఎస్పీ తుషార్‌డూడీ

